సాక్షి
అనంతపురం
మంగళవారం : 26 : డిసెంబర్ : 2023



కూలీల బిడ్డలకు 'ఉన్నతి'

ఉపాధి హామీ కూలీల పిల్లలకు 'ఉన్నతి' పథకం కింద ప్రభుత్వం శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది. 8లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6.50, నరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ప్రేమ, స్నేహభావంతో మెలగాలి



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, స్నేహభావంతో మెలగాలని ఎస్పీ అన్బురాజన్ సూచించారు. సోమవారం నగరంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు ప్రేమతో ప్రపంచాన్ని జయించారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమ, సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, చర్చి ఫాదర్ వినోద్ కుమార్, సీఐ జాకీర్ హుస్సేన్, సీఐ సుబ్బరాయుడు, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, సరోజ, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బొజ్జమ్మ (ఫైల్)

కూడేరు: అరవకూరుకు చెందిన కురుబ బొజ్జమ్మ (110) మృతి చెందింది. వయసు పైబడినా చలాకీగా ఉండే బొజ్జమ్మ పది రోజుల క్రితం అస్వస్థతకు గురైంది. కోలుకోలేక సోమవారం మనవరాలి ఇంట్లో చనిపోయింది. ఈమె కుమారుడు సంగన్న పదేళ్ల క్రితం మృతి చెందాడు.

మిస్టర్ ఆసియా పోటీలకు గుంతకల్లు యువకుడు



విశ్వతేజను విజేతగా ప్రకటిస్తున్న నిర్వాహకులు

గుంతకల్లు: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో న్యూఢిల్లీ వేదికగా జరిగే మిస్టర్ ఆసియా పోటీలకు గుంతకల్లుకు చెందిన విశ్వతేజ ఎంపికయ్యాడు. ఈ నెల 23న బెంగళూరు వేదికగా జరిగిన యునైటెడ్ ఇంటర్నేషనల్ బాడీ బిల్డింగ్ ఫిట్నెస్ ఫెడరేషన్ (యుఐబీబీఎఫ్ఎఫ్) పోటీల్లో మెన్స్ ఫిజికల్ సీనియర్ కేటగిరిలో బంగారు పతకాన్ని సాధించి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. గుంతకల్లుకు చెందిన ఉపాధ్యాయుడు ఆర్‌హెచ్ఎం కాశీనాథ్, లావణ్య దంపతుల ఏకైక కుమారుడు విశ్వతేజ ప్రస్తుతం ఐటీ ఫ్యాషన్ మోడలింగ్‌లో రాణిస్తుండడం గమనార్హం.

యువకుడి నేత్రదానం



భరత్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మరణానంతరం తన నేత్రాలు దానం చేసి మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించి పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచాడు ఓ యువకుడు. వివరాలు.. పెనుకొండ మండలం గోనిపేటకు చెందిన మాల భరత్‌కుమార్ (20) ఆదివారం సాయంత్రం 44వ జాతీయ రహదారిపై గోనిపేట బ్రిడ్జి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో చికిత్స కోసం అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో కుటుంసభ్యులు చేర్పించారు. చికిత్సకు స్పందించక సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో తమ కుమారుడి నేత్రాల ద్వారా మరో ఇద్దరికి కంటి చూపును ప్రసాదించాలనుకున్న తల్లిదండ్రులు నాగేంద్ర, పద్మావతి భరత్‌కుమార్ నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలిపారు. భరత్‌కుమార్ మృతదేహం నుంచి నేత్రాలను సర్వజనాస్పత్రి నేత్ర విభాగం వైద్యులు సేకరించారు.

ఆటోలో నుంచి పడి బాలుడి మృతి

రాప్తాడురూరల్: ఆటోలో ప్రయాణిస్తున్న బాలుడు అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని పాతూరు భవానీనగర్‌కు చెందిన శర్మాస్‌వలి తన కుమారుడు షబ్బీర్ (9)తో కలిసి సోమవారం ఉరవకొండలో జరిగిన బంధువుల దినాల్లో పాల్గొన్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఆటోలో తిరుగు పయనమయ్యారు. డ్రైవర్ పక్కన కూర్చున్న షబ్బీర్ అనంతపురం రూరల్ మండల పరిధిలోని బళ్లారి రోడ్డు సాయిబాబా గుడివద్ద పట్టు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయమైంది. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే షబ్బీర్ చనిపోయాడు. రూరల్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఘనంగా క్రిస్మస్



క్రిస్మస్ సందేశమిస్తున్న రెవరెండ్ బెన్‌హర్‌బాబు



అనంతపురం అరవిందనగర్ చర్చిలో సందేశం వింటున్న క్రైస్తవులు



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని చర్చిలో క్రైస్తవుల ప్రార్థన



జిల్లా అంతటా క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం ఉదయాన్నే స్నానమాచరించి నూతన వస్త్రాలు ధరించి చర్చిలకు వెళ్లారు. ఏసయ్య జన్మ వృత్తాంతం వివరించే ప్రదర్శనలు తిలకించారు. పాస్టర్లు జీసస్ జన్మ విశేషాలతో కూడిన సందేశాన్ని వినిపించారు. శాంతి, ప్రేమ, కరుణ, దయ, క్షమా గుణం వంటి ఏసు బోధనలను తెలియజేశారు. అలాగే కోయర్ బృందాలు క్రైస్తవ గీతాలు ఆలపించాయి. తర్వాత సామూహిక ప్రార్థనలు చేశారు. – అనంతపురం కల్చరల్

ఉద్యానంలో అగ్రపథం

- జిల్లాలో 72 రకాల ఉద్యాన తోటల సాగు
- 2.82 లక్షల ఎకరాల్లో పండ్లు, కూరగాయలు, పూలు తదితరాలు
- అత్యధికంగా 90 వేల ఎకరాల్లో చీనీ, 46 వేల ఎకరాల్లో మామిడి, అరటి
- ఏటా 40.52 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన దిగుబడులు

ఉద్యాన పంటల సాగులో జిల్లా అగ్రపథాన దూసుకుపోతోంది. రాష్ట్రంలోనే మరెక్కడా లేని విధంగా వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం.. రాయితీలతో రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఉద్యాన హబ్‌గా 'అనంత' నిలిచి అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

జిల్లాలో ఉద్యాన పంటల సాగు ఇలా..

పంట	విస్తీర్ణం (ఎకరాల్లో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
పండ్లతోటలు	1,61,466 ఎకరాలు	19,30,500 మెట్రిక్ టన్నులు
కూరగాయలు	43,013	18,85,900
పూలతోటలు	1,012	2,950
సుగంధ ద్రవ్యాలు	76,358	2,32,400
ఔషధ పంటలు	60	220
తోట పంటలు	116	340
ఆకుకూరలు	119	350
మొత్తం	2,82,144	40.52 లక్షల మెట్రిక్ టన్నులు



గార్లదిన్నె మండలం ముకుందాపురం వద్ద సాగవుతున్న చీనీ తోట

అనంతపురం అగ్రికల్చర్: అత్యల్ప వర్షపాతం నమోదయ్యే జిల్లాగా పేరుగాంచిన అనంతపురం ఉద్యాన పంటలకు ప్రసిద్ధిగాంచింది. ఇన్నాళ్లు 30 నుంచి 35 రకాల ఉద్యాన తోటలు సాగులో ఉన్నాయని అందరికీ తెలుసు. కానీ అంతకు మించి సాగయ్యాయని వెల్లడైంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ–క్రాప్, ఈ–కేవైసీని అత్యంత పారదర్శకంగా చేపట్టడంతో పంటల వివరాలు పక్కాగా నమోదవుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం ఖరీఫ్–2023లో జిల్లా వ్యాప్తంగా ఏకంగా 72 రకాల ఉద్యాన తోటలు సాగయ్యాయి. అన్ని రకాల ఉద్యాన పంటలు 2,82,144 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేశారు. వీటి నుంచి 40.52 లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడులను అంచనా వేశారు. రూ.7 వేల కోట్లకు పైగా టర్నోవర్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రధానంగా చీనీ, అరటి, మామిడి, దానిమ్మ, టమాట, మిరప, ఉల్లి తదితర పంటలే అధిక విస్తీర్ణంలో సాగయ్యాయి.

72 రకాల పంటలు ఇవే..

జిల్లాలో 18 రకాల పండ్లతోటలు, 25 రకాల కూరగాయల పంటలు, 7 రకాల పూల తోటలు, 7 రకాల ఆకుకూరలు, నాలుగు రకాల ఔషధ పంటలు, 3 రకాల తోట పంటలు, మరో 8 రకాల సుగంధ ద్రవ్యాల పంటలు... వెరసి 72 రకాల పంటలు సాగు చేసినట్లు ఖరీఫ్ ఈ–క్రాప్ నివేదిక స్పష్టం చేస్తోంది. అందులో ఫ్రూట్‌క్రాప్స్ కింద చీనీ, నిమ్మ, దానిమ్మ, మామిడి, అరటి, రేగు, అవకాడో, అంజూర, యాపిల్ రేగు, ఉసిరి, కర్బూజ, కళింగర, జామ, సపోట, బొప్పాయి, ద్రాక్ష, సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్ ఉన్నాయి.

- కూరగాయల పంటల కింద అనప, ఉల్లి, గుమ్మడి, బూడిద గుమ్మడి, సొరకాయ, పొట్లకాయ, కాకర, క్యాప్సికమ్, క్యారెట్, క్యాబేజీ, కాలీఫ్లవర్, చిక్కుడు, గోరుచిక్కుడు, ముల్లంగి, టమాట, పచ్చిమిరప, బెండ, వంకాయ, బీన్స్, చిలగడదుంప, మునగ, దోస, బీట్‌రూట్, ఆలూ తదితర పంటలు వేశారు.
- సుగంధ ద్రవ్యాల కింద ఎండుమిరప, కరివేపాకు, ధనియాలు, చింత, విత్తన ధనియాలు, పసుపు, వక్క, వాము తదితర ఎనిమిది రకాలు ఉన్నాయి.
- పూలతోటల కింద బంతి, చామంతి, మల్లె, రోజా, కనకాంబరం, లిల్లీ, ఫ్లూమెరియా ఉన్నాయి.
- తోటపంటల కింద కొబ్బరి, ఆయిల్‌పాం, ఆకు తోటలు ఉన్నాయి.
- ఆకుకూరలు కింద పాలకూర, తోటకూర, మెంతి, ఉల్లికాడలు, కొత్తిమీర, గోంగూర సాగు చేశారు.
- ఔషధ పంటల కింద అశ్వగంధ, అలోవేరా, నన్నారి, పామ్‌రోజా తదితర పంటలు సాగు చేసినట్లు ఈ–క్రాప్‌లో స్పష్టంగా నమోదు చేశారు. అర ఎకరా, పావు ఎకరా లాంటి తక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన మరికొన్ని ఆకు కూరలు, కూరగాయ పంటలు ఈ–క్రాప్‌లో నమోదు చేయలేదని చెబుతున్నారు. అన్నీ పరిగణనలోకి తీసుకుంటే జిల్లా వ్యాప్తంగా ఏకంగా 80కు పైగా ఉద్యాన తోటలు సాగులో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఉద్యాన రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాయితీలతో ప్రోత్సహిస్తుండటంతో చాలామంది రైతులు ఈ తరహా పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలు, ఐదెకరాల్లోపున్న రైతులకు 90 శాతం సబ్సిడీ, ఇతరులకు 70 శాతం సబ్సిడీతో పెద్ద ఎత్తున డ్రిప్ పరికరాలు అందిస్తుండటంతో 99 శాతం మంది రైతులు సూక్ష్మసాగు సేద్యం ద్వారా ఉద్యాన తోటలు సాగు చేస్తున్నారు. ఏటా రూ.10 కోట్ల వరకు ఉద్యానశాఖకు బడ్జెట్ కేటాయిస్తూ పథకాలు అమలు చేస్తున్నారు. దేశాయ్ లాంటి పది వరకు కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని సాగు పద్ధతులు, మార్కెటింగ్‌కు ప్రభుత్వం సహకారం అందిస్తుండటం, దేశ విదేశాలకు నేరుగా ఫలసాయం ఎగుమతులను ప్రోత్సహిస్తుండటం, అలాగే అనంతపురంలోనే అతిపెద్ద చీనీ, టమాట మార్కెట్ అందుబాటులో ఉండటం, కరోనా లాంటి కష్టకాలంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్‌కు ఇబ్బంది లేకుండా చేయడం లాంటి చర్యల వల్ల 'అనంత' ఉద్యాన నిలయంగా మారుతోంది.

ఉద్యాన తోటలకు అనువైన ప్రాంతం



ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, శీతోష్ణస్థితి, నేల రకాలు పరిగణనలోకి తీసుకుంటే ఉద్యానతోటల సాగుకు అనంతపురం జిల్లా అనుకూలం. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, వర్షాలు, పెరిగిన భూగర్భజలాలు, మార్కెటింగ్ సదుపాయం పెరగడం తదితర వాటి వల్ల ఇటీవల కాలంలో రైతులు ఉద్యానతోటల సాగుకు ఆసక్తి చూపిస్తున్నారు. పండ్లు, కూరగాయల తోటల పెంపకం బాగా పెరిగింది. ఇక్కడ పండుతున్న ఫలసాయానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉండటం వల్ల రకరకాల ఉద్యానతోటలు విస్తరించాయి.

– బి.రఘునాథరెడ్డి, డీడీ, ఉద్యాన శాఖ

జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా



అనంతపురం సిటీ: ఉభయ జిల్లాల జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు అనంతపురంలోని జెడ్పీ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే చివరి క్షణంలో వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ మేరకు జెడ్పీ సీఈఓ కేతన్‌గార్గ్ సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొనాల్సి ఉన్నందున జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు సీఈఓ తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని అందులో పేర్కొన్నారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా

అనంతపురం: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంరంభం మంగళవారం ప్రారంభం కానుంది. నగరంలోని పీటీసీ మైదానంలో జిల్లాస్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ గౌతమి, ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. అలాగే యోగా, టెన్నికాయిట్, మారథాన్ పోటీలకూ అవకాశం కల్పించారు. విజేతలను సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలతో సత్కరిస్తారు.

మహిమాన్వితుడు బాబయ్య స్వామి

పెనుకొండ: దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన పెనుకొండ బాబయ్య స్వామి మహిమాన్వితుడని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం బాబయ్య స్వామి గంధం వేడుకలు, ఉరుసు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే శంకరనారాయణ బాబయ్య స్వామి సమాధికి పట్టు వస్త్రం సమర్పించారు. మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచనల మేరకు స్వామికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రం సమర్పించామన్నారు. దర్గా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే రూ. కోట్లు విడుదల చేయగా, పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో దర్గాపీఠాధిపతి తాజ్‌బాబా, మున్సిపల్ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, అధికారులు పాల్గొన్నారు.

సర్వమతాల సారం ఒక్కటే

సర్వమతాల సారం ఒక్కటేనని పలువురు వక్తలు అన్నారు. పట్టణంలోని బాబయ్య స్వామి దర్గా వద్ద సోమవారం రాత్రి పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా సెమినార్ జరిగింది. అనంత సాహిత్య అకాడమీ అధ్యక్షులు జాబిలిచాంద్‌భాష, ఆలిండియా టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ అధ్యక్షులు ఉమర్‌ఫారూక్‌ఖాన్, రవిశంకర్ గురూజీ, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ గజల్ శ్రీనివాస్, కడప దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా, జస్వంత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. దర్గా పీఠాధిపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రేమానురాగాలు కలిగి ఐకమత్యంగా జీవించాలన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా గంధం వేడుక

పెనుకొండలో బాబయ్యస్వామి మొదటి పీఠాధిపతి సజ్జద్‌బాబా గంధం వేడుక ఘనంగా జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో దర్గా సమీపంలోని సజ్జద్‌బాబా ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన గంధం వేడుక కనుల పండువగా సాగింది. ఫక్కీర్లు, మతపెద్దలు, భక్తుల కోలాహలం నడుమ సజ్జద్‌బాబా తలపై గంధాన్ని తీసుకెళ్లి సమాధి వద్ద సమర్పించారు.



బాబయ్య స్వామికి సమర్పించేందుకు పట్టు చాదర్ తీసుకెళ్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

స్మార్ట్ చదువులకు సిద్ధం

- 3, 4, 5 తరగతుల విద్యార్థులకు స్మార్ట్ టీవీల ద్వారా బోధన
- 860 స్కూళ్లకు చేరనున్న 998 స్మార్ట్ టీవీలు

స్మార్ట్ టీవీల సరఫరా ఇలా..

నియోజకవర్గం	తొలివిడత	రెండో విడత
అనంతపురం	60	92
గుంతకల్లు	82	111
కళ్యాణదుర్గం	104	247
రాప్తాడు	15	40
రాయదుర్గం	224	198
శింగనమల	85	89
తాడిపత్రి	67	84
ఉరవకొండ	122	137
మొత్తం	759	998



అనంతపురం రూరల్ మండలం కేకే కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలోని స్మార్ట్‌టీవీ

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో సమూల మార్పులు వచ్చాయి. ప్రభుత్వ బడుల్లో చాక్‌పీస్‌లకు గుడ్ బై చెప్పే రోజులు వచ్చేశాయి. చాక్‌పీస్, బ్లాక్ బోర్డులతో పని లేకుండా పూర్తిస్థాయి డిజిటల్ బోధన అందుబాటులోకి రానుంది. ఇప్పటిదాకా తరగది గదిలో టీచర్లు బ్లాక్, గ్రీన్ బోర్డులను ఉపయోగిస్తూ పాఠాలు చెప్పేవారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కార్పొరేట్ బడులకు దీటుగా, అంతకు మించి పూర్తి స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లల్లో బోధనా పద్ధతుల్లో సమూల మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే సరైన మౌలిక వసతులు ఉండవనే పరిస్థితి నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ బడులంటేనే ప్రత్యేకంగా మాట్లాడుకునే రోజులు వచ్చాయి. దీనంతటికీ కారణం 'మనబడి నాడు–నేడు' కార్యక్రమంతో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించడం, చకచకా మారుతున్న డిజిటలైజేషన్ విధానమే. ప్రపంచస్థాయిలో పోటీ పడేందుకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో లేనివిధంగా రూ.కోట్లు ఖర్చుచేసి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, స్మార్ట్ టీవీలను తీసుకొచ్చింది. నిరంతరాయంగా డిజిటల్ బోధన అందించేందుకు, సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పిస్తోంది.

860 స్కూళ్లకు 998 స్మార్ట్ టీవీలు

రెండోవిడతలో జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు పనులు చేపట్టిన 860 ప్రాథమిక పాఠశాలలకు 998 స్మార్ట్ టీవీలు రానున్నాయి. జనవరి రెండోవారానికి రెండోవిడత స్మార్ట్ టీవీలన్నీ జిల్లాకు చేరతాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. తొలివిడతలో 414 ప్రాథమిక పాఠశాలలకు 759 స్మార్ట్‌టీవీలు వచ్చాయి. ఇవన్నీ ఆయా స్కూళ్లలోని తరగతి గదుల్లో ఏర్పాటు చేశారు. వీటిద్వారానే ప్రస్తుతం బోధన సాగుతోంది. రెండు విడతల్లో కలిపి మొత్తం 1,757 స్మార్ట్‌టీవీలు కేటాయించారు. రెండు విడతల్లో దాదాపు అన్ని స్కూళ్లలోనూ స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేసినట్లయింది.

డిజిటల్ విద్యకు పెద్దపీట



రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విద్యకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నాడు–నేడు పనులు చేపట్టిన స్కూళ్లకు ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు సరఫరా చేస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతగా వచ్చిన ఐఎఫ్‌పీలు, స్మార్ట్‌టీవీలు అన్ని స్కూళ్లలోనూ ఏర్పాటు చేశాం. వాటిద్వారానే తరగతులు బోధిస్తున్నారు. రెండోవిడత స్మార్ట్ టీవీలు త్వరలోనే రానున్నాయి. అందుకు సంబంధించిన జాబితా జిల్లాకు చేరింది.

– వి.నాగరాజు, డీఈఓ

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం సిటీ: నగర శివారులోని ప్రసన్నాయపల్లి రైలు మార్గంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని సోమవారం గుర్తించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు. వెల్వెట్ గ్రీన్ ఫ్లవర్స్ కలిగిన లుంగీ, బ్రౌన్ కలర్ డ్రాయర్ ధరించి ఉన్నట్లు వివరించారు. అంతకు మించి శరీరంపై ఎలాంటి దుస్తులు లేవన్నారు. 5 అడుగుల ఎత్తు కలిగి, గడ్డం పెరిగి ఉందన్నారు. ఆదివారం సాయంత్రం లేదా రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. వ్యక్తి అదృశ్యం కేసులకు సంబంధీకులు ఎవరైనా ఉంటే 99088 37888, 94405 52808లో సంప్రదించాలని కోరారు.

సోమనాథ్‌కు నృత్య కౌముది పురస్కారం

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన శాస్త్రీయ నృత్య కళాకారుడు సోమనాథ భరద్వాజ్... నృత్యకౌముది పురస్కారాన్ని అందుకున్నారు. ఏలూరు పట్టణంలో అభినయ నృత్యకళాభారతి ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ చాటిన సోమనాథ్‌ను అభినందిస్తూ పురస్కారాన్ని పశ్చిమగోదావరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ సంగీత్‌మాధుర్, మాజీ మంత్రి రంగారావు, డాక్టర్ కనుమూరి రమేష్, డాక్టర్ ప్రసాద్, ఏపీ నాటక పరిషత్తు సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల రామారావు అందజేశారు.

యువకుడి దుర్మరణం



రవితేజ (ఫైల్)

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన గొల్ల నారాయణస్వామి, రాజమ్మ దంపతుల కుమారుడు రవితేజ (25) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ఓ వైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ మరో వైపు వ్యవసాయంలో తల్లిదండ్రులకు సాయంగా ఉండేవాడు. ఈ క్రమంలో ఆవుల దాణా కొనుగోలు చేసేందుకు ఆదివారం రాత్రి స్కూటీపై అనంతపురానికి వెళుతుండగా మార్గమధ్యంలో కక్కలపల్లి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రవితేజ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ ప్రవీణ్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కూలీల బిడ్డలకు ఉన్నతి

- ఉపాధి హామీ పథకం కింద 100 రోజుల పని పూర్తి చేసిన వారికి దన్ను
- కుటుంబ సభ్యుల్లో విద్యావంతులకు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వ చర్యలు
- తొలుత వివిధ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ
- శిక్షణ కాలంలో రోజు కూలి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, వైద్య సదుపాయం



శిక్షణలో పాల్గొన్న యువతీ యువకులు

అనంతపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిరుపేదలకు పనులు కల్పిస్తూ ఆదుకుంటున్న జగన్ సర్కార్... తాజాగా మరో అడుగు ముందుకేసింది. ఉపాధి కూలీల ఇళ్లలో విద్యావంతులైన వారికి ఉద్యోగాల కల్పనకు సిద్ధమైంది. ఈ క్రమంలో వారికి తొలుత ప్రత్యేక శిక్షణ ద్వారా నైపుణ్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తూ, ప్రతిభ చాటిన వారికి ఉద్యోగాల కల్పన చేసేలా కార్యాచరణతో ముందడుగు వేసింది. ఈ మొత్తం ప్రక్రియను 'ఉన్నతి' పథకం ద్వారా ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి కార్యరూపంలోకి తీసుకు వచ్చింది.

కేంద్రం భాగస్వామ్యంతో...

కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఉన్నతి పథకాన్ని జగన్ సర్కార్ పక్కాగా అమలు చేస్తోంది. వంద రోజుల పనిదినాలు పూర్తి చేసుకున్న ఉపాధి కూలీల కుటుంబాల్లోని నిరుద్యోగులు ఈ పథకానికి అర్హులు. వీరికి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయూజీకేవై) కింద పలు సాంకేతిక కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రధానంగా ఆటోమోటివ్ ప్రొడక్ట్ డిజైన్ లీడ్ ఇంజినీర్, క్యాడ్ టెక్నీషియన్, సేల్స్ సూపర్‌వైజర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ అసెంబుల్ ఆపరేటీవ్, డెస్క్‌టాప్ పబ్లిషింగ్, డేటా ఎంట్రీ టెక్నికల్ తదితర కోర్సులతో పాటు సాఫ్ట్ స్కిల్స్, కంప్యూటర్స్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో శిక్షణ ఇస్తున్నారు.

తొలి విడతలో 90 మంది

డీడీయూజీకేవై పథకం కింద శిక్షణ పొందేందుకు పదో తరగతి అపై చదువులు అభ్యసించిన 45 ఏళ్లలోపు వయసున్న ఉపాధి కూలీల బిడ్డలు అర్హులు. ఇప్పటికే తొలి విడతలో జిల్లా వ్యాప్తంగా 90 మంది అర్హులను గుర్తించి శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 30 నుంచి 35 మంది శిక్షణ పొందుతున్నారు. ఎంపిక చేసుకున్న కోర్సును బట్టి 3 నుంచి 6 నెలల వరకు శిక్షణ ఉంటుంది. శిక్షణా కాలంలో ఒక్కొక్కరికి రోజుకు రూ. 272 భృతి అందజేస్తున్నారు. ఉచిత హాస్టల్ వసతితో పాటు మూడు పూటలా భోజనమూ ఇస్తారు. దుస్తులు, పుస్తకాలతో పాటు ఉచిత వైద్య సదుపాయం ఉంటుంది. శిక్షణ పూర్తికాగానే ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తారు.

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ



ఉపాధి హామీ కుటుంబాల్లో చదువుకున్న వారిని గుర్తిస్తున్నాం. ఈ పని వేగంగా సాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు అర్హులను గుర్తించి వారికి ఆసక్తి ఉన్న కోర్సుల్లో నైపుణ్యాలు మెరుగుపడేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఈ మొత్తం ప్రక్రియ డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పక్కాగా నిర్వహిస్తున్నాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

జనవాక్కు

రూ.2.54 లక్షలకు పైగా వచ్చింది



గత ప్రభుత్వంలో అర్హత ఉన్న సంక్షేమ పథకాల లబ్ధి పొందలేకపోయాం. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. దీంతో విసిగిపోయాం. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత గతంలో ఎన్నడూ లేనంతగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి అందరికీ చేకూరింది. మా కుటుంబమూ రూ.2,54,364కు పైగా లబ్ధి పొందింది. సంక్షేమ ఫలాలను సక్రమంగా ఇంటి వద్దకే వచ్చే అందిస్తున్నారు. ఇప్పటి వరకూ రైతు భరోసా కింద రూ.40.500, ఆసరాతో రూ.8,124, పంటల బీమా కింద రూ.3,578, పింఛన్ కానుక ద్వారా రూ.1,00,500, ఆరోగ్యశ్రీ కింద రూ.97,498, ఆరోగ్య ఆసరా రూ.4,725 చొప్పున లబ్ధి పొందాను. దీంతో మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. మా కష్టాలు తీర్చిన సీఎం వైఎస్ జగన్‌కే మళ్లీ మద్దతుగా నిలుస్తాం.

– గోవిందరెడ్డి, పెద్దపల్లి, మడకశిర మండలం

ప్రతి కుటుంబానికీ లబ్ధి



రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరింది. గతంలో టీడీపీకి చెందిన వారికి మాత్రమే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పథకాలను వర్తింపజేసింది. ఇప్పుడా పరిస్థితి లేదు. టీడీపీ వారైనా సరే రాజకీయ వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందజేస్తోంది. నేతన్న నేస్తం కింద నాకూ ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేసింది. ఈ మొత్తాన్ని పెట్టుబడిగా పెట్టి ముడిసరుకు కొనుగోలు చేసి ఆర్థికంగా పురోగతి సాధించా. చేనేతల అభివృద్ధికి సీఎం జగనన్న చేస్తున్న కృషికి రుణపడి ఉంటాం.

– దాసరి ఓబుళపతి, చేనేత కార్మికుడు, తాడిమర్రి

అమ్మ వద్దకే వెళుతున్నా...



ప్రేమ్‌కుమార్ (ఫైల్)

అమ్మ అంటే ఓ అనుబంధం... ఓ ఆత్మీయత. బిడ్డ అవసరాలను అందరికంటే ముందే అమ్మ పసిగడుతుంది. తన బిడ్డ విజయాలు సాధించినప్పుడు ఆనంద పరవశురాలవుతుంది. బాధల్లో ఉన్నప్పుడు తల్లడిల్లుతుంది. అలాంటి అమ్మ శాశ్వతంగా దూరమైపోతే.. తట్టుకోలేక పోయింది ఓ యువ హృదయం. అమ్మా నీవు లేని జీవితం వృథా... నీ వెంటే నేనూ అంటూ అర్ధంతరంగా తనువు చాలించింది.

- అనారోగ్యంతో తల్లి మృతి
- ఆవేదనతో కుమారుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం: అనంతపురంలోని హౌసింగ్ బోర్డులో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రేమ్ కుమార్ (45) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆర్టీసీ ఉద్యోగి రంగన్న, విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, మొదటివాడు ప్రేమ్‌కుమార్. రంగన్న మరణానంతరం ఇంటి బాధ్యతలన్నీ ప్రేమ్‌కుమార్ తీసుకున్నారు. పెళ్లి చేసుకుంటే కుటుంబ బాధ్యతను విస్మరిస్తానన్న భయంతో పెళ్లి ఊసెత్తకుండా తమ్ముడిని ఉన్నత చదువులకు ప్రోత్సహించి వివాహం చేశారు. ప్రస్తుతం తమ్ముడు ఆడిటర్‌గా మారి రామ్‌నగర్‌లో భార్యాపిల్లలతో జీవిస్తున్నాడు. ఈ క్రమంలోనే ప్రేమ్‌కుమార్‌కు 2011లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో బెంగళూరుకు చేరుకున్నారు. అయితే కరోనా నేపథ్యంలో వర్క్‌ఫ్రం హోం కావడంతో సొంతింటిలోనే తల్లి, అమ్మమ్మతో కలసి ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

మూడు రోజుల క్రితం తల్లి కన్నుమూత

మూడు రోజుల క్రితం తల్లి విజయలక్ష్మి ఆరోగ్యం క్షీణించి మృతి చెందింది. బంధువులు, కుటుంబ సభ్యులు అందరూ వచ్చి కార్యక్రమాలు పూర్తి చేసుకుని వెళ్లారు. ఇంట్లో అమ్మమ్మ, ప్రేమ్‌కుమార్ మాత్రమే మిగిలారు. తల్లి చనిపోయిన క్షణంలోనే ప్రేమ్‌కుమార్ మానసికంగా కుదేలయ్యాడు. ఆమె చూపించిన ప్రేమ తరచూ కళ్ల ముందు కదులుతూ ఉంటే మూడు రోజులుగా కన్నీరు ఆగలేదు. ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా తనలోనే రోదిస్తూ వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అమ్మమ్మ భోజనానికి పిలవడంతో తనకు ఆకలిగా లేదని చెప్పి బెడ్‌రూంలోకి వెళ్లాడు. తల్లితో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ రాత్రంతా ఓ లేఖలో పొందుపరిచాడు. తన జీతం, బ్యాంకు లావాదేవీల వివరాలు, ఖాతాలకు చెందిన పాస్‌వర్డ్‌లు, పీపీఎఫ్, బంగారు నగల వివరాలు తదితరాలను వివరంగా రాసి ఒక బాక్సులో ఉంచి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

అమ్మలేని జీవితం వృథా

సోమవారం ఉదయం పొద్దెక్కినా ప్రేమ్‌కుమార్ బెడ్ రూం నుంచి బయటకు రాకపోవడంతో అమ్మమ్మ వెళ్లి తలుపు తట్టింది. ఎలాంటి స్పందన లేకపోవడంతో చుట్టుపక్కల వారి సాయం కోరింది. దీంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకుని పరిశీలిస్తే లోపల ఫ్యాన్‌కు ఉరి చేసుకుని విగతజీవిగా వేలాడుతున్న ప్రేమ్‌కుమార్ కనిపించాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు ముందు ప్రేమ్‌కుమార్ రాసిపెట్టిన లేఖ స్వాధీనం చేసుకున్నారు. అందులో 'అమ్మ లేకుండా నేను ఉండలేకపోతున్నా. అమ్మ వద్దకే వెళుతున్నా' అంటూ రాసి ఉంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడి ఇంటిపై దాడి

అనంతపురం క్రైం: స్థానిక ఆదర్శనగర్‌లో నివాసముంటున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి ఇంటిపై ఆదివారం రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. స్కార్పియో వాహనం అద్దాలు ధ్వంసం చేశారు. ఆ సమయంలో ప్రతాపరెడ్డితో పాటు ఆయన కుమారుడు గౌతమ్ ఇంటి నుంచి బయటకు రావడంతో దాడికి తెగబడ్డారు. ఘటనలో ఓ యువకుడు గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కేసు నమోదుకు ప్రతాపరెడ్డి సుముఖత వ్యక్తం చేయకపోవడంతో పోలీసులు వెనుదిరిగారు.

బంగారు, నగదు చోరీ

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో ఓ మహిళ బ్యాగ్‌లోని బంగారు, నగదును దుండగుడు అపహరించుకెళ్లాడు. వివరాలు... తాడిపత్రి పట్టణానికి చెందిన లక్ష్మీదేవి సోమవారం ఉదయం తన పిల్లలతో కలసి కణేకల్లుకు బస్సులో ప్రయాణమయ్యారు. ఉరవకొండకు చేరుకున్న ఆమె కణేకల్లు బస్సు ఎక్కిన తర్వాత తన బ్యాగ్‌లో ఉంచిన 1.50 తులం బంగారు గొలుసు, రూ.2 వేల నగదు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శెట్టూరు: ఇనుప పైపు మీద పడడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... శెట్టూరు మండలం ములకలేడుకు చెందిన హరిజన కొల్లప్ప (55) వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పొలంలోని బోరుబావిలో ఉన్న మోటారుకు అనుసంధానం చేసేందుకు ఇనుప పైపులను తెప్పించి మిద్దెపై నిల్వ చేశారు. వీటిని వారం రోజుల క్రితం తన కుమారుడు తిప్పేరుద్రతో కలసి మిద్దెపై కిందకు దించుతుండగా ఓ వైపు కొల్లప్ప తల, భుజంపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కొల్లప్పను వెంటనే కళ్యాణదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన సోమవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడ్ని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: ద్విచక్రవాహనం మరమ్మతు విషయంగా ఘర్షణ చోటు చేసుకుని వ్యక్తి మరణానికి కారణమైన కేసులో హత్యా నేరం కింద నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం సీఐ హరినాథ్, రూరల్ సీఐ నాగరాజుతో కలసి డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం వెల్లడించారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ప్రభాకర్ కుమారుడు రాజు... కళ్యాణదుర్గంలో ద్విచక్ర వాహనాల మరమ్మతు పనులతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం రాజు వద్ద నారాయణపురం గ్రామానికి చెందిన రామాంజినేయులు తన ద్విచక్ర వాహనాన్ని మరమ్మతు చేయించాడు. అయితే వాహనాన్ని సక్రమంగా రిపేరి చేయకపోవడంతో అసహనానికి గురైన ఆయన ఆదివారం సాయంత్రం గ్రామంలోని ప్రభాకర్ ఇంటివద్దకెళ్లి తీవ్ర పదజాలంతో దూషణలకు దిగాడు. దీంతో సహనం కోల్పోయిన ప్రభాకర్... రామాంజినేయులు చెంపపై బలంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ప్రభాకర్‌ను సోమవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ప్రతిభ చాటిన 'పురం' కళాకారులు



అవార్డులు అందుకున్న కూచిపూడి నృత్యకారులు

హిందూపురం: కూచిపూడి నృత్యంలో హిందూపురం గతిస్వం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ మేరకు గతిస్వం సాంస్కృతిక కళా నిలయం వ్యవస్థాపకులు, నాట్యాచార్యులు దుర్గా విద్యాధరి తెలిపారు. హైదరాబాద్‌లోని భారత్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించిన కూచిపూడి కళావైభవం కార్యక్రమంలో గతిస్వం విద్యార్థులు నిర్విషా, శ్రీకృతి, శ్రేయ, భవిష్య, ప్రవళిక, శ్రావణి, రేఖ, కావ్య, సమన్విత, గ్రీష్మ, మిస్మి గగన, మధురిమ, మోక్షిత, మోక్షద అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారన్నారు. మొత్తం ఏడు నిమిషాల నిడివి గల కూచిపూడి నృత్యాన్ని లయబద్ధంగా ప్రదర్శించి టాప్ టెన్‌లో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు పరిశీలనకు నిర్వాహకులు ఎంపిక చేశారని, త్వరలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో హిందూపురం శాస్త్రీయ నృత్యకారులకు చోటు దక్కనుండడంపై హర్షం వ్యక్తం చేశారు.

పొత్తుల విషయం త్వరలోనే తేలుతుంది

- బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

అనంతపురం టవర్‌క్లాక్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతో ఎలాంటి పొత్తూ ఉండదని బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ స్పష్టం చేశారు. మిగతా పార్టీలతో పొత్తుల విషయాన్ని త్వరలోనే తేలుస్తామన్నారు. సోమవారం ఆయన అనంతపురంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక దేశం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. రోడ్ల నిర్మాణంలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. పేదలు, రైతులకు సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. మెట్రో రైళ్లు, విమానాశ్రయాలు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, నాయకులు లలిత్‌కుమార్, చిరంజీవి రెడ్డి, ఓలేటి రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

టూవీలర్‌ను ఢీ కొన్న ఎంపీడీఓ కారు

పుట్టపర్తి అర్బన్: ఎంపీడీఓ కారు ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండల ఎంపీడీఓ ఆజాద్ కొత్తచెరువులోని అద్దె ఇంట్లో నివాసముంటూ విధులకు కారులో వెళ్లి వచ్చేవారు. ఈ క్రమంలో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముగించుకుని కారులో కొత్తచెరువుకు తిరుగు ప్రయాణమైన ఆయన... రాత్రి 7 గంటల సమయంలో కొత్తచెరువు మండలం లోచర్ల వద్దకు చేరుకోగానే రోడ్డు పక్కగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఘటనలో ద్విచక్ర వాహనం నడుపుతున్న బైరాపురానికి చెందిన రామచంద్రారెడ్డి కాలు పూర్తిగా తెగిపోయింది. తలకూ బలమైన గాయాలయ్యాయి. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను అటుగా వెళుతున్న వారు గుర్తించి వెంటనే 108 అంబులెన్స్ ద్వారా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన సీఐ రాగిరి రామయ్య మాట్లాడుతూ.. రొళ్ల ఎంపీడీఓ ఆజాద్ కారు (ఏపీ 02 ఏవై 0270)ను స్వాధీనం చేసుకున్నామని, ఆయన ఆచూకీ తెలియడం లేదన్నారు. కాగా, మద్యం మత్తులో ఎంపీడీఓ ఆజాద్ వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమైనట్లుగా పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి.

రాష్ట్రస్థాయి భజన పోటీల విజేత 'అనంత'



నగదు పురస్కారాన్ని అందుకుంటున్న కూచివారిపల్లి భజన బృందం సభ్యులు

రాజుపాళెం (వైఎస్సార్ జిల్లా): హనుమద్ వ్రత మహోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్‌ఆర్ జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని రాజుపాలెం మండలం వెల్లాల పుణ్యక్షేత్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో అనంతపురం జిల్లా యల్లనూరు మండలం కూచివారిపల్లి సీతారామ భజన సంఘం మొదటి స్థానంలో నిలిచింది. సోమవారం మధ్యాహ్నం వరకూ కొనసాగిన పోటీలను పోటీలు ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, ఈఓ బీవీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి పర్యవేక్షించారు. రెండో స్థానంలో రాప్తాడు మండలం మరూరు చిన్న కదరయ్య బృందం, ఏడో స్థానంలో నార్పల మండలం వెంకటాంపల్లె శ్రీరామ బృందం, 15వ స్థానంలో పామిడి దత్తాత్రేయ బృందం నిలిచాయి. విజేతలను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు. అలాగే ఉత్తమ గాయని, గాయకుడు, హార్మోనిస్ట్, తబలిస్ట్, కోరస్‌లకు ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున అందజేశారు. మొత్తం 45 భజన సంఘాలు పాల్గొనగా, న్యాయ నిర్ణేతలుగా కర్నూలు జిల్లాకు చెందిన తిరుపాలు, తెలంగాణలోని గద్వాల్‌కు చెందిన సత్తెన్న, వ్యాఖ్యాతగా తాడిపత్రి శ్రీనివాసరెడ్డి వ్యవహరించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అనంతపురం క్రైం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పంతుల కాలనీలో నివాముంటున్న మందల కృపారాజు (35) కుటుంబసభ్యులు క్రిస్మస్ సందర్భంగా సోమవారం ఉదయం చర్చికి వెళ్లారు. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న కృపారాజు ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా వచ్చిన కుటుంబసభ్యులు తలుపులు తీయాలంటూ ఎంతసేపు తట్టినా ఎలాంటి స్పందన లేకపోవడవంతో స్థానికుల సాయంతో బలవంతంగా తెరచి లోపలకు ప్రవేశించారు. అప్పటికే ఫ్యాన్‌కు విగతజీవిగా వేలాడుతున్న కృపారాజును గమనించి కిందకు దించారు. సమాచారం అందుకున్న నాల్గో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, ఘటనపై ఆరా తీశారు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న కృపారాజు చిన్నపాటి గొడవల కారణంగా క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెలుగు చూసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా 'క్రిస్మస్'





క్రిస్మస్ కేక్ వద్ద సత్యసాయి సెంట్రల్ సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు, నిర్వహణ కమిటీ సభ్యులు, బ్రాస్ బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థులు

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధి చెంత క్రిస్మస్ వేడుకను దేశవిదేశాలకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన సత్యసాయి భక్తులు ప్రశాంతి నిలయంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్యసాయిని, క్రీస్తును కొనియాడుతూ భక్తిగీతాలు ఆలపించారు. బ్రాస్ బ్యాండ్ వాయిద్యంతో చక్కటి స్వరాలొలికించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన క్రిస్మస్ వేడుకల నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా తయారు చేయించిన క్రిస్మస్ కేక్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి కట్ చేశారు. అనంతరం సత్యసాయి పూర్వపు ప్రసంగాలను వినిపించారు. సాయంత్రం వివిధ దేశాలకు చెందిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చిన్నారులు క్రిస్మస్ క్యారల్స్‌ను ఆలపించారు.



వేడుకల్లో పాల్గొన్న విదేశీ సత్యసాయి భక్తులు

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత క్రిక్ లవర్స్ జట్టు



క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఆట ఏదైనా గెలుపోటములను సమానంగా స్వీకరించి, క్రీడా స్ఫూర్తి చాటాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన క్రిక్ లవర్స్, డివైన్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సభ సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథి జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ క్రికెట్‌కు విపరీతమైన ఆదరణ ఉందన్నారు. టోర్నమెంట్ విజయవంతం చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. క్రిక్ లవర్స్ జట్టు విన్నర్‌గా నిలవగా, అమిటీ క్రికెట్ క్లబ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. వారికి ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కిషోర్, స్పాన్సర్లు నారాయణస్వామి, సురేష్, ప్రసాద్, ప్రతాప్ సహా వివిధ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన మహిళ

అనంతపురం క్రైం: నగరంలోని కేఎస్‌ఆర్ జూనియర్ కళాశాల వద్ద సోమవారం మధ్యాహ్నం ఓ వృద్ధురాలిని ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడమవైపు నుదుటి భాగంలో గాయమవడంతో వృద్ధురాలు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు గుర్తించి ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈమె వివరాలు తెలిసిన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ వెంకటేష్‌నాయక్ తెలిపారు.

కాపర్ వైరు, ఆయిల్ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు

యాడికి: వ్యవసాయ పొలాల్లో ఉన్న 5 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరు, ఆయిల్‌ను దోచుకెళ్లిన ఘటన మండలంలోని చందన గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. చందన, రాయలచెరువు రహదారిలో పొలిమేర పెద్దమ్మ గుడి సమీపంలో చందన గ్రామానికి చెందిన దేవరాజు, హనుమప్పనాయుడుకు చెందిన తోటలో గల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, సరస్వతీ విద్యామందిరం ఎదురుగా గోపాల్, గంగరాజు, రాయలచెరువుకు చెందిన మరో రైతు రాధాకృష్ణకు తోటలోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్‌ను తీసుకెళ్లారు. సోమవారం ఉదయం పొలాలకు వచ్చిన రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఘనంగా ఆవుల జాతర



పూజలందుకుంటున్న చిత్రలింగేశ్వరస్వామి

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎర్ర కొండాపురంలో సోమవారం ఆవుల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవుల కుల దైవం చిత్రలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం గ్రామ సమీపంలోని ఆవుల గూడు వద్ద చిత్ర లింగేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను కొలువు దీర్చి గ్రామంలోని పశువులను గూడు చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఇలా చేయడం ద్వారా పశువులు ఎటువంటి వ్యాధులు దరిచేరవని గ్రామస్తుల నమ్మకం. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా వెండి పల్లకీ ఉత్సవం



స్వామి గ్రామోత్సవం

కుందుర్పి: మండలంలోని కొలిమిపాళ్యంలో సోమవారం వెండి పల్లకీ ఉత్సవం, తోపులో జాతరతో మచ్చేంద్రమయ్య స్వామి జాతర ఉత్సవాలు ముగిశాయి. సాయంత్రం స్వామిని వెండి పల్లకీలో గ్రామోత్సవం చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వాడవాడలా క్రిస్మస్ వేడుకలు



సందేశం ఇస్తున్న పాస్టర్ విజయ్య



హ్యాపీ క్రిస్మస్ అంటూ పాటలు పాడుతున్న క్రైస్తవులు



హెర్మోన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



క్యాండిల్ వెలిగిస్తున్న యువతులు



అరవిందనగర్ చర్చిలో వేడుకలకు హాజరైన మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం, చవ్వా, శమంతకమణి తదితరులు



రాచానపల్లిలో పేదలకు చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ప్రార్థనా మందిరం క్రైస్తవ భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన వేడుకలు సోమవారం రాత్రి దాకా కొనసాగాయి. ఏసుక్రీస్తు చూపిన బాటలో నడుద్దామని దైవ సేవకులు అన్నారు. సేవా కార్యక్రమాలతో భగవంతున్ని మెప్పించాలన్నారు.

- సప్తగిరి సర్కిల్లోని ఎస్‌యూఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పాస్టర్ సంపత్ విజయ్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు.
- జీసెస్ కంపాషన్ చర్చిలో జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మోజెస్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వేడుకలకు వందలాది మంది హాజరయ్యారు.
- జీసెస్ నగర్‌లోని అగాపె ప్రార్థనా మందిరంలో జరిగిన వేడుకల్లో పలువురు రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కోయర్ బృందాలు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. సాయినగర్‌లోని బైబిల్ స్కూల్ అకాడమీలో వేడుకలు ఘనంగా జరిగాయి.
- అరవిందనగర్‌లోని సీఎస్‌ఐ, హెర్మోన్ చర్చిల్లో వేడుకలు వైభవంగా జరిగాయి. రెవరెండ్ బెన్‌హర్‌బాబు బైబిల్ ప్రవచనాలను వినిపించారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కరరెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.
- కోర్టు రోడ్డులోని గాస్పెల్ హాల్, రామచంద్రనగర్‌లోని కార్మెల్ మాత ప్రార్థనా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి.

చర్చిలకు గడియారాల పంపిణీ

అనంతపురం: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చర్చిలకు కేకులు, గడియారాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ ఎం.సుబ్బరాయుడు , టెక్నికల్ ఇంజినీర్ వి.మోతీలాల్ నాయక్, డీలర్లు పాల్గొన్నారు.

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి వద్ద ఉన్న ఏసుకృపా మందిరంలో రెడ్డివారి నేహెమ్యా నాగరాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

అనంతపురం రూరల్: క్రిస్మస్ సందర్భంగా శిల్పారామంలో అనంత్‌నాగ్ సంగీత స్వర్ కల్చర్ కమిటీ ఆధ్వర్యంలో సినీ సంగీత, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- క్రిస్మస్ సందర్భంగా నగరంలోని బెరాకా వృద్ధాశ్రమంలో డాక్టర్ అబ్దుల్ రజాక్ గఫూర్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీరాములు, పాస్టర్ రత్నం పాల్గొన్నారు.

రాప్తాడు: ఏసు మార్గం అనుసరించాలని రాప్తాడులోని కరుణామయుడు పుణ్యక్షేత్రం చర్చి, చిన్మయనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఎస్ చర్చి విచారణ గురువులు రవీంద్ర ప్రసాద్, ఫాదర్ బాలరాజు పేర్కొన్నారు. సోమవారం మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రాప్తాడులో చర్చిల్లో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకూ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసు ప్రభువు లోక సంరక్షణ కోసం జన్మించారని, ఆయన చూపిన సన్మార్గంలోనే మనమంతా నడవాలని ఉపదేశించారు. పశువుల పాకలో జన్మించి కేవలం 32 ఏళ్లు మాత్రమే జీవించి తన ప్రసంగాలు, మహిమలతో ప్రపంచంలోని కోట్లాది మంది ప్రజల బాధలను తొలగించారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు రాజా రెడ్డి, బాల శౌరి, రాజీవ్ ఫాదర్, మర్రి రెడ్డి, అంత్యయ్య, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు. ప్రార్థనల్లో ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, మండల కన్వీనర్ జూటూర్ శేఖర్, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, నాయకులు గవ్వల పరంధమ, కాంట్రాక్టర్ చంద్ర తదితరులు పాల్గొని క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మకూరు మండలంలో..

ఆత్మకూరు: మండలంలోని పి. యాలేరు చర్చిలో పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు జననం తెలిపేలా నమూనాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరు, పంపనూరు, సనప గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా సాగాయి.

కనగానపల్లి: మండలంలో సోమవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సీఎస్ కోట ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం అర్ధరాత్రి నుంచి గ్రామస్తులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొన్నారు. ఫాదర్ తంబి జోసఫ్ ఏసుప్రభు బోధనలు వివరించారు. సాయంత్రం చర్చి ఆవరణలో ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోయువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లోని చర్చిలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆశీర్వదిస్తున్న పాస్టర్



చిన్మయనగర్ ఎస్‌ఎఫ్‌ఎస్ చర్చిలో బోధనలు చేస్తున్న విచారణ గురువు రవీంద్ర ప్రసాద్



సీఎస్ కోటలోని ఆర్‌సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



భారతి సిమెంట్స్ ఆధ్వర్యంలో గడియారాలను పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆత్మకూరు చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పత్రి స్థలం టూరిజానికి కేటాయించొద్దు

- ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసిన ప్రభుత్వ వైద్యుల సంఘం

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన ఎకరం స్థలాన్ని టూరిజం శాఖకు కేటాయించవద్దని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.రామస్వామినాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే అనంతను సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, కోశాధికారి డాక్టర్ హేమలత కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇటీవల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చెందిన సర్వే నంబర్ 326–4లో ఎకరా స్థలాన్ని టూరిజం శాఖకు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు సూపర్ స్పెషాలిటీ సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. భవిష్యత్తులో మరిన్ని వైద్య సదుపాయాలు పెరిగే అవకాశం లేకపోలేదన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆస్పత్రి స్థలం ఇతర ఏ శాఖలకూ కేటాయించకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డితో మాట్లాడుతున్న డాక్టర్ రామస్వామినాయక్

‘ఆడుదాం ఆంధ్రా’కు సర్వం సిద్ధం

అనంతపురం కార్పొరేషన్: క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి వారు ఉన్నత స్థాయికి చేరేందుకు దోహదపడేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. అనంతపురం నియోజకవర్గంలోని 85 సచివాలయాల పరిధిలో 21,742 మంది క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో 11,078 మంది పురుషులు, 10,664 మంది మహిళలు ఉన్నారని, 864 జట్లు బరిలో దిగనున్నాయని తెలిపారు.

8 మైదానాల్లో పోటీలు

‘ఆడుదాం ఆంధ్రా’లో భాగంగా మంగళవారం నుంచి జనవరి 9 వరకు సచివాలయాల పరిధిలో పోటీలు జరుగుతాయని ఇన్‌చార్జ్ కమిషనర్ తెలిపారు. అనంతరం వివిధ దశల్లో ఫిబ్రవరి 10 వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల 1, 2, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం, జేఎన్‌టీయూ మైదానం, నీలం సంజీవరెడ్డి స్టేడియం, ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల మైదానం, ఎస్‌ఎస్‌బీఎన్ ఇండోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందుకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థను సమన్వయం చేసుకుని ముందుకెళ్తున్నామన్నారు. ఐదుగురు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు పేర్కొన్నారు. క్రీడా పోటీలు విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

నారాయణపురంలో ఉద్రిక్తత

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని నారాయణపురంలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఆదివారం ద్విచక్రవాహనం మరమ్మతు విషయంలో జరిగిన ఘర్షణలో రామాంజనేయులు అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం దాడిచేసిన ప్రభాకర్ అనే వ్యక్తి ఇంటివద్ద మృతి చెందిన రామాంజనేయులు కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ నాగరాజు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి ఇరు కుటుంబాలకు సర్ది చెప్పడంతో ఘర్షణ సద్దుమణిగింది.

ప్రభాకరా.. పండుగ వేళా ప్రవర్తన మారదా?

- అలంకరణ పేరుతో వైఎస్సార్‌సీపీ జెండాల తొలగింపు
- అడ్డుకున్న పోలీసులు

తాడిపత్రిటౌన్: మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరు వివాదాలకు దారి తీస్తోంది. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన గురించి పట్టించుకోవడం మాని వైఎస్సార్‌సీపీని లక్ష్యంగా చేసుకుని బురదజల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. నూతన సంవత్సర వేడుకల కోసం విద్యుత్ స్తంభాలను అలంకరించే పేరిట అక్కడక్కడా స్తంభాలకు కట్టిన వైఎస్సార్‌సీపీ జెండాల తొలగింపు చర్యలకు సోమవారం పూనుకున్నారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద జెండాలు తొలగిస్తుండగా పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైఠాయించి హంగామా సృష్టించారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఉనికి చాటుకోవడానికి, ఆధిపత్యం చెలాయించడానికి ఆందోళన పేరుతో రెచ్చిపోవడం జేసీకి పరిపాటిగా మారిందని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయంగా ఉందని, తరచూ ప్రశాంతతకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన చెందారు.పండుగ వేళ ఇదేమి లొల్లి అంటూ ఈసడించుకున్నారు.



రోడ్డుపై హంగామా చేస్తున్న మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలోని బాలేపాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి కుమారుడు వంశీనాథ్‌రెడ్డి (26) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటరామిరెడ్డి, శాంతకుమారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డుల ప్రదానం

అనంతపురం కల్చరల్: నగరంలో ఓమ్ సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. సోమవారం మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పరిరక్షణ సంస్థ జిల్లా అధ్యక్షులు వన్నూరప్ప, ఓమ్ సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య, నాగరాజు, ఉమాదేవి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

7న గిరిజనుల శంఖారావం

అనంతపురం టవర్‌క్లాక్: గిరిజన ప్రజా సమాఖ్య, గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో జనవరి ఏడో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గిరిజనుల శంఖారావం నిర్వహించనున్నట్లు జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలిక అదృశ్యం

పెద్దవడుగూరు: పి.వీరన్నపల్లిలో అర్చన అనే బాలిక అదృశ్యమైనట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం కొత్త దుస్తులు తెచ్చుకోవడం కోసం బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నేడు అయ్యప్పస్వామి నగర సంకీర్తన

రాయదుర్గంటౌన్: పట్టణంలో మంగళవారం అయ్యప్పస్వామి నగరసంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శాంతినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అయ్యప్పస్వామి మాలధారులు, భక్తులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పాడి ఆవుల మృతి

బెళుగుప్ప: మండలంలోని బెళుగుప్ప తండాలో గిరిధర్‌నాయక్‌కు చెందిన రెండు పాడి ఆవులు సోమవారం యూరియా ద్రావణం త్రాగి మృతి చెందాయి. బాధిత రైతు వివరాల మేరకు.. రోజూలాగే రెండు ఆవులను సోమవారం గ్రామ సమీపంలోని తోట వద్దకు మేపునకు తీసుకెళ్లాడు. పొలంలో పిచికారీ కోసం తొట్టిలో ఉంచిన యూరియా ద్రావణాన్ని ఆవులు తాగాయి. వెంటనే పశువైద్యాధికారి రమేష్‌కు సమాచారం అందించగా.. అధికారులు చేరుకొనే సమయానికే ఆవులు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.లక్ష పైగా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు. అధికారులు స్పందించి ఆదుకోవాలన్నాడు.

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు



అక్షింతలతో గురుస్వామి లక్ష్మిరెడ్డి తదితరులు



అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలకు నగరంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం రాత్రి నగర పాలక స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ లక్ష్మిరెడ్డి ఇతర మాలధారులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 31 వరకు అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. అలాగే రాముల వారి చిత్రపటంతో కూడిన కరపత్రాన్ని జనవరి 1 నుంచి 5వ తేదీ వరకు ఇంటింటికీ వితరణ చేస్తామని తెలిపారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

ఆత్మకూరు: మండల కేంద్రంలో సోమవారం అయోధ్య మందిరం నుంచి వచ్చిన అక్షింతలను ఊరేగించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు భజనలు చేశారు. అక్షింతలను మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉంచినట్లు నిర్వాహకులు తెలియజేశారు. మంగళవారం ప్రతి గ్రామంలో అందించనున్నట్లు చెప్పారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న హంపీ పీఠాధిపతి

గుంతకల్లు రూరల్: హంపీ పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతీ స్వామీజీ వారు సోమవారం కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. హనుమద్ వ్రతం ఉత్సవాల అనంతరం ఆలయ ప్రాంగణంలోని బెళ్లోణ సత్రంలో బెళ్లోణ రామనాథ శాస్త్రి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏటా దత్త జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో సోమవారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న హంపీ పీఠాధిపతి కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు ఆశీర్వచనాలను అందజేశారు.



ప్రదక్షిణలు చేస్తున్న హంపీ పీఠాధిపతి